క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలతో విద్యార్థులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని నారాయణ పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పీపీ–2 నుంచి 1వ తరగతి, 5వ తరగతి నుంచి హైస్కూల్‌కు ప్రవేశిస్తున్న విద్యార్థులకు జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు పట్టాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఆర్‌అండ్‌డీలు మహేశ్వరీ, మీనా, కో–ఆర్డినేటర్లు వాణి, ప్రియాంక, ప్రిన్సిపాల్ రవికుమార్, డీన్ హరిబాబు, ఏఓ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్స్ స్నేహ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డి గళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

కందుకూరు: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ టి.దేవేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఇందిర కోరారు. మండల పరిధిలోని దాసర్లపల్లితండాకు చెందిన నేనావతి కేస్లీకి రూ.58వేలు, రమావత్ రవికి రూ.15వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఆ లబ్ధిదారులకు ఎమ్మెల్యే సబితా రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం వారు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హుడాకాంప్లెక్స్: ఉచిత వైద్య శిబిరాలను పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని వేంకటేశ్వరకాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గండు ధనంరెడ్డి కోరారు. మంగళవారం రోడ్ నెం–3లోని కమ్యూనిటీ హాల్‌లో ఓజోన్ ఆస్పత్రి, వన్ విషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా వైద్యుల పర్యవేక్షణలో 240 మందికి కంటి పరీక్షలు, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. శిబిరంలో డాక్టర్లు అరుణ, భవాని, సంజనలతో పాటు అంజలి, అనీల్, కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్, జాయింట్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌యాదవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కడ్తాల్: మండల కేంద్రంలో లయన్స్ కంటి ఆసుపత్రి(కడ్తాల్) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. నేత్ర వైద్యుడు పవన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో కంటి సమస్యతో బాధపడుతున్న 16 మందిని గుర్తించారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఎనుగొండకు ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, వైద్య సిబ్బంది రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే!

- రోడ్డు పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కందుకూరు: రహదారి పక్కనే అతి తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో అటు వైపు ప్రయాణించే వారు హడలిపోతున్నారు. ఆదమరిస్తే దాన్ని తాకి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఇది మండలంలోని వావిళ్లకుంట తండా నుంచి మీర్‌ఖాన్‌పేటకు వెళ్లే రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి.

రహదారి విస్తరణతో..

ఏడాదిన్నర క్రితం కందుకూరు–యాచారం మండలాలను కలిపే ప్రధాన లింకు రహదారిని ప్రభుత్వం అభివృద్ధి చేపట్టింది. అందులో భాగంగా వావిళ్లకుంట తండా పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద 200 అడుగుల ఫార్మాసిటీ రహదారి పూర్తయిన తర్వాత అక్కడి నుంచి ఉన్న మిగతా రోడ్డుని విస్తరించే పనులు చేపట్టింది ప్రభుత్వం. కాగా ఈ క్రమంలో తండా సమీపంలో రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండా పనులు పూర్తి చేశారు. దీంతో ప్రస్తుతం ఆ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. ఆ రహదారిపై నుంచి ప్రయాణించే వారు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని హడలిపోతున్నారు. తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు దగ్గరికి వచ్చే వరకు కన్పించకుండా ఉంది. దీంతో వాహనాలు ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది. మరోపక్క మూగ జీవాలు ఆ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే గడ్డి మేయడానికి వచ్చినా వాటికి ముప్పు తప్పదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎత్తులో ఏర్పాటు చేయాలి



రహదారి పక్కనే తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదకరంగా మారింది. వాహనాలు ప్రయాణించేటప్పుడు అదుపు తప్పి ఢీకొడితే అంతే సంగతులు. పశువులకు ఇబ్బందే. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలి.

– రూప్లానాయక్, వావిళ్లకుంటతండా

సమస్య పరిష్కరిస్తాం



మీర్‌ఖాన్‌పేటకు వెళ్లే మార్గంలో రహదారి పక్కన కిందికి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. దాంతో పాటు ఇతర చోట్ల సమస్యాత్మకంగా ఉన్న వాటిని గుర్తించి సమస్య పరిష్కరిస్తాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ, కందుకూరు

ఆవరణంతా వాహనాలే.. ఆటలాడేదెలా?

పార్కింగ్‌కు అడ్డాగా ప్రశాంతిహిల్స్ ఫేజ్–2లోని కమ్యూనిటీహాల్ ప్రాంగణం



కమ్యూనిటీహాల్ ఆవరణలో పార్కు చేసిన వాహనాలు

మీర్‌పేట: ప్రాంగణమంతా వాహనాలు పార్కు చేస్తే.. ఆటలాడేదెలా అని యువకులు ప్రశ్నిస్తున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ప్రశాంతి హిల్స్ ఫేజ్–2లోని కమ్యూనిటీహాల్ ఆవరణ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. ఇదే ప్రాంగణంలో దుర్గాభవాని దేవాలయం కూడా ఉండడంతో అటు భక్తులు, స్థానిక యువతకు ఇబ్బందిగా మారింది. ఆడుకోవడానికి ఉన్న కొద్దిపాటి స్థలంలోనూ వాహనాలు పార్కు చేస్తే తాము ఎక్కడ ఆడుకోవాలని స్థానిక యువత పేర్కొంటున్నారు. కొంత కాలంగా తాము ఆడుకునే స్థలాన్ని పూర్తిగా వాహనాలు నిలుపడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆడుకోవాల్సి వస్తోందన్నారు. కొన్ని రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉంటాయని, స్థానిక యువత, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకొని ఆటలాడుకునే స్థలంలో వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలనీలో కబ్జాలు లేవు

విచారణ చేయాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంసీఆర్ కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని ఎంసీఆర్ కాలనీలో ఇంచు భూమి కూడా కబ్జా కాలేదని ఆ కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బడంగ్‌పేట కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న పార్కులు యథావిధిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి అసలే లేదన్నారు. కొందరు వ్యక్తులు ఎంసీఆర్ కాలనీని బదునాం చేసేందుకు పూనుకున్నారని ఆరోపించారు. అవగాహన లేని వ్యక్తుల వల్ల తమ కాలనీ పేరు అప్రతిష్టపాలు అవుతుందని వాపోయారు. కాలనీలో స్థలాలు కబ్జాకు గురైతే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అరుణ్‌గౌడ్, కార్యదర్శి నర్సింగ్‌నాయక్, కోశాధికారి దివ్య, యూత్ ప్రెసిడెంట్ వివేక్, మెంబర్లు శ్రీకాంత్, సాయిరాం, జైరాం, నరేష్, చందునాయక్, సికిందర్, సురేష్, సాయితేజ, శ్రీనివాస్, హర్ష, వేణు, హరినాయక్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే అభివృద్ధి పనులు



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్, నాయకులు

పహాడీషరీఫ్: ఎమ్మెల్యే సబితారెడ్డి కృషి ఫలితంగా జల్‌పల్లి మున్సిపాలిటీ రూపురేఖలు మారుతున్నాయని ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలో రూ.67 లక్షల నిధులతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ బస్తీలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. గడిచిన ఏడేళ్ల నుంచి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆమె ప్రత్యేక నిధులు కేటాయిస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఈ పైప్‌లైన్‌తో ప్రజలకు ఇబ్బందులు దూరం కానున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే సబితారెడ్డితో పాటు మాజీ చైర్మన్ అబ్దుల్లా సాదిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మిస్కిన్ బాబా, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు ఎన్నిక

ఇబ్రహీంపట్నం: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. 72 ఓట్లకుగాను వంద శాతం పోలింగ్ నమోదయ్యాయి. అధ్యక్షుడిగా ముద్దం వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వై.భాస్కర్, జాయింట్ సెక్రటరీగా కె.క్రిష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా రామకృష్ణ, మల్లేష్ ఎన్నికయ్యారు. కాగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్. జైపాల్‌నాయక్, లైబ్రరీ సెక్రటరీగా ఎస్.పాండు, ట్రెజరర్‌గా సాయికుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: విధుల పట్ల నిర్లక్ష్యం పాటించరాదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సమస్య, ఈజీఎస్, డ్రైనేజీ పనులు, రాజీవ్ యువ వికాసం స్కీమ్ తదితర సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. జాబ్ కార్డులున్న కూలీలు ఉపాధి పనులు చేసుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. పైలెట్ పథకం కింద ఎంపిక చేసిన తక్కళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పనులు వేగవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం షురూ

తలకొండపల్లి: రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పడకల్ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతరులను నమ్మి మోసపోకూడదని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

మాజీ మేయర్ పారిజాత



అల్మాస్‌గూడలో సంవిధాన్ పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ నుంచి మంగళవారం జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. భారత స్వతంత్ర్యాన్ని సిద్ధింపజేసిన జాతిపిత మహాత్మాగాంధీ, అలాగే దేశానికి రాజ్యాంగాన్ని రచించి భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలను చేతబూనిన నాయకులు కాలనీలు, వీధులు, ఇంటింటికీ తిరుగుతూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని విలువలు ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొన్ని శక్తులు రాజ్యాంగాన్ని అవమానపరుస్తున్నారని, ఎట్టి పరిస్థితిల్లో మనం దరం ఐక్యంగా ఉండి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉద్యమంలో భాగస్వాములమవుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వంటేటి ప్రభాకర్‌రెడ్డి, సామ ప్రభాకరెడ్డి, గట్టు బాలకృష్ణ, నవారు మల్లారెడ్డి, సుభాష్‌యాదవ్, బి.జంగయ్య, ఉమేశ్, రవికాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానని కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. శ్రీరాంకాలనీ కార్గో రోడ్డుపై గత కొన్ని రోజులుగా మురుగునీరు పారుతున్న విషయమై స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని నీరు నిలిచిపోవడానికి గల కారణాలు గుర్తించారు. అవుట్ లెట్ సాఫీగా వెళ్లకుండా వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు కొందరు వ్యాపారుల వస్తువులు అడ్డుగా పెట్టినందుకే సమస్య తలెత్తిందని గుర్తించారు. వెంటనే సిబ్బందిని పెట్టి వ్యర్థాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి వాడలు అధికంగా ఉన్న ఈ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్, పర్యావరణాధికారి ఎం.శ్రీను, సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ఏడీఏ శోభారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శోభారాణి హెచ్చరించారు. పట్టణంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్ షాపుల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాబోయే సీజన్‌లో స్టాకు రిజిస్టర్లు ఏ విధంగా నిర్వహించాలో, విక్రయాల సమయంలో విధిగా రసీదులు ఇవ్వడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ శోభారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, ఫర్టిలైజర్స్, క్రిమి సంహారక మందులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ప్రతిఒక్కరూ విధిగా స్టాక్ రిజిస్టర్లు మెయింటైన్స్ చేయాలని, ఎప్పటికప్పుడు విక్రయాల వివరాలు నమోదు చేయాలని కోరారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ మండలాల వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి, రేణుకా చక్రవర్తిని, శ్రీలత, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలంటూ నిరసన



ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, సీపీఎం నాయకులు

కందుకూరు: ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని లబ్ధిదారులు ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్లు 788, 107లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసి, ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు కబ్జా చూపలేదన్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఆందోళనలు చేసినా ఫలితం లేదని వాపోయారు. లబ్ధిదారులకు ఈ నెల 15 వరకు కబ్జా చూపుతామని గత నెలలో ఆర్డీఓ హామీ ఇచ్చారని, హామీని నెరవేర్చేవరకు కదిలేదిలేదని భీష్మించారు. కాగా ఆ సమయంలో ఆర్డీఓ, తహసీల్దార్ ఇద్దరూ లేరు. దీంతో సీఐ సీతారామ్ వారి వద్దకు వచ్చి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఆయన హామీ మేరకు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, లబ్ధిదారులు సిద్ధం అంజయ్య, రాయికంటి శేఖర్, మంగలి రాములు, మంచని ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో పేదలకు మేలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ తదితరులు

కందుకూరు: పేదలు సన్నబియ్యం తినాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ కొనియాడారు. మంగళవారం కందుకూరులో సన్నబియ్యం లబ్ధిదారులైన ఎడ్ల మహేందర్‌ముదిరాజ్, రాములుముదిరాజ్ ఇళ్లల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో పదేళ్ల పాటు రేషన్ కార్డుల కోసం లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేలా కాంగ్రెస్ నాయకులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సామాజిక న్యాయం చేసిందన్నారు. బాపూజీ, అంబేడ్కర్, రాజ్యాంగం గురించి అందరికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లు.. పన్నులో మినహాయింపులు

- భువన్ సర్వే పూర్తి కాక మున్సిపల్ ఆదాయానికి గండి
- రూ.లక్ష వరకు రావాల్సిన చోట రూ.5వేల లోపే వసూలు



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

తుర్కయంజాల్: ఇళ్లు, వాణిజ్య సముదాయాలను జియో ట్యాగింగ్ చేయడంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఏటా ఆదాయానికి గండిపడుతోంది. బంధు ప్రీతి, రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక, అంగ బలం, అమ్యామ్యాలకు లొంగుతుండటంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పేదల నుంచి ముక్కుపిండి పన్ను వసూలు చేస్తున్న అధికారులు.. వ్యాపారవేత్తల విషయంలో వెనక్కి తగ్గుతున్నారు. 2020లో కరోనా వ్యాప్తి కంటే ముందే తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లను సర్వే చేసినప్పటికీ వాటిని అప్‌డేట్ చేయించడంలో కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అటకెక్కాయి. ఇటీవల ఈ నెల చివరి వరకు ప్రతి ఆస్తిని జియో ట్యాగింగ్ చేయాలని సీడీఎంఏ ఆదేశించడంతో ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

రూ.20 కోట్లకు అవకాశం

మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో 20,650 ఇళ్లు, వాణిజ్య సముదాయాలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను డిమాండ్ రూ.16.30 కోట్లు. అందులో 78.26 శాతం పన్ను వసూలు చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా జియో ట్యాగింగ్ పూర్తి చేస్తే ఏటా రూ.20 కోట్లకు పైగానే డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. చాలా మంది వ్యాపారాలు నిర్వహించే వారు రూ.లక్షల్లో పన్ను రావాల్సి ఉన్న కేవలం రూ.వేలల్లో చెల్లిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఇలాంటి వాళ్లను గుర్తించి పకడ్బందీగా పన్ను వసూళ్లను చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జియో ట్యాగింగ్ చేస్తాం



ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా భువన్ యాప్ ద్వారా జియో ట్యాగింగ్ చేపడుతున్నాం. ఇప్పటికే సిబ్బంది మొత్తం ఇదే పనిలో నిమగ్నం అయ్యాం. ఈ నెల చివరి వరకు 100 శాతం పూర్తి చేస్తాం. పన్ను డిమాండ్ పెరిగేలా చర్యలు చేపడుతాం. ట్యాక్స్ తక్కువగా చెల్లిస్తున్న వాటిని రివిజన్ చేస్తాం.

– అమరేందర్‌రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

మచ్చుకు కొన్ని సంఘటనలు

- కమ్మగూడలో సాగర్ రహదారికి ఆనుకుని సుమారు 2000 గజాల్లో ఓ వ్యక్తి అనుమతులు లేకుండా భారీ షెడ్‌లను నిర్మించి ఎలక్ట్రికల్ దుకాణం కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. దీనికి ఏటా మున్సిపాలిటీ ట్యాక్స్ కేవలం రూ.4370 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇటీవల ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోగా భువన్ ట్యాగింగ్ చేశారు. దీంతో రూ.93,114 ట్యాక్స్ వచ్చింది. ఇలా అధికారులు రివిజన్ చేయకుండా వదిలేయడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడింది.